
ఈ వారం
బహుమతి పొందిన కథ

# "నిశ్చల"

ఆకాశం నిర్మలంగా ఉంది.

చంద్రుడు ముఖానికి అద్దిన తిలకంలా మెరుస్తున్నాడు.

**మూడుముళ్ళ బంధం పడకుండానే ఏడడుగులు సంబంధం లేకుండానే మాతృస్థానం పొందిన ఓ స్వబల గాథ!**



నగలో పొదిగిన రాళ్ళలా నక్షత్రాలు తళుక్కుమంటున్నాయి

పిల్లతెమ్మెర మనసాహ్లాదపరిచేదిగా ఉంది.

ఆహ్లాదాన్ని అనుభవించడానికి పిల్లాపాపలతో టాంక్ బండ్ చేరుకున్న జనంతో సందడిగా కలర్‌ఫుల్‌గా ఉంది.

ఆ వాతావరణాన్ని చూసి మరో భారతం రాయడానికి సిద్ధంగా ఉన్నట్లుగా నన్నయ్య విగ్రహం. ఆ విగ్రహాన్ని ఆనుకుని ఈ భారతంలో తన పాత్ర మరో శకుంతల కాబోతున్నదేమోనన్న బాధతో భవిష్యత్తుని ఊహించుకుంటూ శూన్యంలోకి చూస్తూ కూర్చున్న నిశ్చల.

## కృష్ణ దాసరి

నిశ్చలలో ప్రశాంతతలేదు.

పున్నమినాటి కల్లోల సాగరంలా ఉంది.

ఆమె కల్లోల మనస్సును మరింత ఉద్రిక్తం చేసేదిగా టాంకుబండ్‌పై కార్ల హోరు, ప్రజల రొద అప్పటికి నిశ్చల టాంక్‌బండ్ చేరుకుని సుమారు రెండు గంటలైంది. వినోదానికి

వారం వారం ఓ ఉత్తమ కథకు రూ. 116 బహుమతిగా అందజేస్తాం

వచ్చినవాళ్ళు ఇంటి ముఖంపడుతున్నారు. తను వచ్చిన దగ్గర నుండి ఇప్పటివరకు టాంక్‌బండ్‌పై ఆ చివరనుండి ఈ చివరకు మూడుసార్లు తిరిగింది. కాని రోహిత్ కనబడలేదు. కాళ్ళు పీకుతుంటే నన్నయ్య విగ్రహం దగ్గర కూలబడిపోయింది. కాని ఆమె మనస్సులో ఏదో మూల చిన్న ఆశ. రోహిత్ వచ్చి ఉంటాడని, తనకోసం ఎదురుచూస్తూ ఉండవచ్చని. మరోసారి టాంక్ బండ్ అంతా గాలిస్తే రోహిత్ కనబడతాడేమోనన్న ఆశ. ఆ ఆశతో మరోసారి పైకి లేచి నడుస్తూ ప్రతి వ్యక్తినీ గుచ్చిగుచ్చి చూస్తూ ముందుకు సాగుతోంది. కాని రోహిత్ పోలికలు ఎక్కడా కనబడలేదు.

"సిగ్నల్ లైట్‌లో రంగులు మారుతున్నాయి. ఆమె జీవితాన్ని హెచ్చరిస్తున్నట్టు. విశ్వంలో దుఃఖం ఆగడంలేదు. అంచెలంచెలుగా పెల్లుబుకుతుంది. తనను ఎవరన్నా చూస్తే బాగుండదని మోచేతులు ట్యాంక్‌బండ్ ఆర్చిపై ఆన్చి తలదించుకుని , హుస్సేనుసాగర్‌లోకి . చూస్తూ ఉండిపోయింది.

కదులుతున్న సాగర్‌నీటిలో ఆమె నీడ అస్పష్టంగా భారతీయ స్త్రీ జీవితానికి నిదర్శనంగా రిఫ్లెక్ట్ అవుతుంది.

"ఏం చెయ్యాలి?" ఎంత సేపనిలా ఎదురు చూడాలి?

అసలు రోహిత్ వస్తాడా? అతడేమయ్యాడు?

మనస్సంతా చిందరవందరగా ఉంది. టాంక్ బండ్‌పై ఒంటరిగా ఉన్న విశ్వంను చూసి కుర్రకారు పక్కనుండిపోతూ విజిల్స్ వేస్తున్నారు.

"ఊ అంటే శ్రమదానం చెయ్యడానికి!"

"ఏంటి ఈ ప్రపంచం?"

ఈ ప్రపంచంలో ఎన్ని విలువైన అపురూపమైన వస్తువులు ఉన్నా అవేమీ సింగిల్‌గా ఉన్న ఆడదానిని డామినేట్ చేయలేకపోతున్నాయి. ఎవరేమన్నా అవేమీ పట్టించుకోవడంలేదు విశ్వం.

ప్రేమే నేరమౌనా నా పై ఏల ఈ పరీక్ష?" అస్పష్టమైన ధ్వనితరంగాలు ఆమెను మరింత వేధించసాగాయి.

"రోహిత్ ఎంత మోసగాడు. నా ఒడిలో తలవాల్చి నీవే నా సర్వస్వం అన్నాడు. నా అధరాలను చుంబిస్తూ ఈ రసానుభూతి ఈ జన్మాంతం ఉండడానికి అనుమతి ఇవ్వవూ అని నన్ను ప్రాథేయపడ్డాడు" నా మోమును తన రెండు చేతులలోకి తీసుకుని నీవు నాకు దేవుడిచ్చిన వరానివి అన్నాడు నా జన్మకు అర్థాన్నిచ్చిన రూపం నీది అనన్నాడు.

"ఆ మాటలన్నీ ఏమయ్యాయి?"

అవన్నీ నన్ను మోసం చేయడానికి ఉపయోగించిన మంత్రాలని నేనెందుకు ఆలోచించలేకపోయాను. అతని మాయ మాటలు నమ్మి నా సర్వస్వాన్ని అతనికే అర్పించాను. స్వేచ్ఛగా బతకాలనుకున్నాను. ప్రేమే స్వేచ్ఛకు మొదటి మెట్టనుకున్నాను... ఆ ప్రేమే నన్నిప్పుడు మోసం చేసిందా?"

"బ్లడీ బాస్టర్డ్! నా సర్వస్వాన్నీ జుర్రుకుని నీ చావు నువ్వు చావని నన్నిలా ఒంటరిగా వదిలేశాడు"

వాడితో తిరిగిన పాపానికా నాకీ శిక్ష

'పొత్తి కడుపుపై చేతితో తడుముకుంది బాధగా.

"చావాలా? బతకాలా?" బాగా ఆలోచిస్తుంది.

ఇప్పటికే ఒకడివల్ల జీవితాన్ని నాశనం చేసుకున్నాను. మిగిలిన జీవితాన్ని ఎందుకు నాశనం చేసుకోవాలి.

"ఒక రాక్షసుడికి నేను బలైపోయాను. నా వలన మరొకరు బలై పోకూడదు.

"ఏ స్వేచ్ఛకై నేను పరితపించానో ఎలాంటి జీవితాన్ని గడపాలనుకున్నానో అలాగే బతుకుతాను.

"ఎన్ని ఒడిదుడుకులనైనా స్త్రీ భరించగలదని స్త్రీ అబల కాదు సబల అని నిరూపిస్తాను.

"ఈ సమాజం ఏమనుకున్నా ఫర్వాలేదు"

"చచ్చిన తరువాతే మనిషియొక్క మంచితనాన్ని గుర్తించే సమాజం ఏమనుకుంటే నాకేం."

విశ్వం పరిపరివిధాల ఆలోచించింది. సుదూర ఆకాశంలో అరుంధతి నక్షత్రం తళుక్కున మెరిసింది.

కంటి చివరకు చేరుకున్న బాధాదర్పిత అశ్రు బిందువులను కర్చీపుతో అంతంచేసి గుండె నిబ్బరం చేసుకుని తన రూంవైపు కదిలింది.

* * *

"రండి పిన్నిగారూ! రండి!...బాగున్నరా?"

బాబాయిగారు ఎలా ఉన్నారు. గుమ్మంలోకి అడుగుపెట్టిన విశ్వం తల్లిని కుశల ప్రశ్నలు వేసింది విశ్వం రూమ్మేట్.


"బాగున్నానమ్మా... మా విశ్వం ఏది? " ఒంట్లో బాగోలేదని తెలిసింది. ఏమైంది మా విశ్వంకి.

"ఏమోనండి రెండురోజుల నుండి భోజనం చేయడంలేదు. ఒకటే ఆలోచిస్తుంది. ఏమైందో అడుగుతుంటే చెప్పదు. ఇంటి ధ్యాసలో బెంగపడిందేమోనని మీకు ఉత్తరం నేనే రాశాను.. రండి!"

"అమ్మా విశ్వం... ఏమైందే నీకు ఎందుకలా ఉన్నావు.

"తల్లిని చూసి భోరున ఏడ్చింది విశ్వం. విశ్వంకు ఏమైందో తెలియక ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు ఏడుస్తున్న విశ్వంను గుండెలకు హత్తుకుని. ఏమైందమ్మా చెప్పుతల్లీ నీకు నేను తప్ప ఎవరున్నారు. ఎందుకలా ఏడుస్తున్నావు చెప్పమ్మా! ఏదైనా జరక్కూడనిది జరిగిందా? ఆ మాటలన్నపుడు మరింత ఉధృతమైంది విశ్వం ఏడుపు.

విశ్వం తలపై చేతితో నిమురుతూ ఏమైంది



తల్లి నీకు. నేనున్నానుగా. చెప్పమ్మా.. ఎందుకిలా ఉన్నావు''

''వణుకుతున్న స్వరంతో ... అ...మ్మా... నే...ను.. మోసపోయానమ్మా'' అంది.


విశ్వల తల్లికి ఏమీ అర్థంకాలేదు. గాబరాతో ఏంటమ్మా ఏమైందో సరిగా చెప్పమ్మా.

''అమ్మా... నేను రోహిత్ అనే అబ్బాయిని ప్రేమించానమ్మా. వాడు నన్ను శతవిధాల నాశనం చేసిపోయాడు'' అని భోరున ఏడ్చింది.

విశ్వల తల్లికి కాళ్ళ కింద భూదేవి కంపిస్తున్నట్టు అనిపించింది. కొద్దిసేపు ఏమీ మాట్లాడలేకపోయింది.

చాలాసేపటికి ఏంటే నువ్వంటున్నది?

''అవునమ్మా. ప్రేమ పేరుతో నన్ను మోసం చేశాడు.''




''ఒక్క ప్రక్క బాధతో.. మరో ప్రక్క కోపంతో విశ్వలతల్లి ఊగిపోయింది.

విశ్వల అలా ఏడుస్తూనే ఉంది.

''నీ తల్లిదండ్రులు చేతకాని వెధవలనుకున్నావా. ఒక్కదానివి నీకు పెళ్ళిచేయలేమనుకున్నావా? మేము సంపాదించిందంతా నీ కోసమేకదే? అయ్య! అయ్య! ఎంత బరితెగించావు. నీ లాంటి దాన్ని కన్నందుకు మేము తెంపలేసుకోవాలే!''

''పిన్నిగారూ తెలిసో తెలియకో తప్పు చేసింది. మనం ఎన్ననుకున్నా ఇక లాభమేంటి. ముందు జరగవలసిందేదో చూడ్డం మంచిదండి.''

''ఓరి దేముడా నా కెన్ని కష్టాలు తెచ్చిపెట్టావురా....''

''పద్లే పద హాస్పటల్‌కి వెళదాం..''

''అమ్మా నేను రానమ్మా.''

''ఏంటి నీకేమన్నా పిచ్చిపట్టిందా... చేసిన వెధవ పని చాలక ఇప్పుడు హాస్పటల్‌కి రానంటావా? అసలేంటి నీ ఉద్దేశం.''

''అమ్మా తెలిసో తెలియకో స్వేచ్ఛగా బ్రతకాలని ఒకడ్ని ప్రేమించాను. వాడి మీద కోపంతో మరొకర్ని బలిచేయడం నాకిష్టంలేదు. —ఏ స్వేచ్ఛకోసం నేను పరితపించానో, అలానే బ్రతుకుతాను ఎవరేమనుకున్నా ఫర్వాలేదు''

''అంటే హాస్పటల్‌కి రావా?''

''రానమ్మా''

''రామరామ ... రామ రామ. చిచ్చి మనుషులు ఆడదానివి కావే.. స్వేచ్ఛంట స్వేచ్ఛ. నీ పరిస్థితి తెలుసుకుని నలుగురు ఉమ్మేస్తే తుడుచుకుని బ్రతడం స్వేచ్ఛా! ఏంటి స్వేచ్ఛ నీ ఇలాంటి దానివని తెలిస్తే ఎవ్వడు పెళ్ళాడతాడే.''

''అమ్మా.... పెళ్ళి లేకపోతే ఆడది బ్రతకలేదా?''

''బ్రతకొచ్చే నలుగురి నోట చీచీ అనిపించుకుంటూ బ్రతకొచ్చు.''

''ఈ సమాజంలో నీకంటూ ఒక ముద్ర వేయించుకుని మరీ బ్రతకొచ్చు.''

''ఏంటమ్మా మాటిమాటికీ సమాజం సమాజం అంటావు నీతి జాతి లేందమ్మా మన సమాజం. చెడుని మరింత చెడుకి చేర్చే వైరస్ క్రిమిలాంటిదీ సమాజం. ఈ సమాజానికి భయపడవలసిన పనిలేదు.''

''అంతేగాని నీ నిర్ణయం మార్చుకోనంటావు''

''ఇందాకే చెప్పాను కదమ్మా. ఏది ఏమైనా నా నిర్ణయం మారదు.''

''ఓసేవ్... ఇన్నాళ్ళు నిన్ను కనిపెంచిన ప్రేమంతా ఏమైంతే చివరికి నువ్వు మాకే పాలు పేర్చేదానివయ్యావా?... రెండు దవడలు పగుల గొట్టేవాడు లేక నీకు పళ్ళు కొవ్వెక్కిందే...''

అటు కన్నకూతుర్ని వదులోకలేక ఇటు ఈ పరిస్థితులో కూతుర్ని ఇంటికి తీసుకెళ్ళలేక పరిపరివిధాల నాపోయింది విశ్వల తల్లి. విశ్వలది చిన్నప్పటి నుంచీ ఇదేవరస. తన మాట తనదేకానీ ఇతరుల మాట వినదు. ఒక్కగానొక్క కూతురు కాదంటే దాని బ్రతుకు ఏమైపోతుందో. పరిపరి విధాల ఆలోచించింది విశ్వలతల్లి.

''అమ్మా విశ్వల నీవు నీ ఇష్టం వచ్చినట్లు బ్రతుకు. కానీ నిన్ను కన్నందుకు మమ్మల్నిలా బాధించడం నీకు భావ్యంకాదు. నీకు చేతులెత్తి దణ్ణం పెడతాను. నా మాట అలకించు. నీ స్వేచ్ఛకు నేనేమీ భంగం కలిగించను. నా మాటినమ్మా?'' అంటూ భోరున ఏడ్చింది.

''తల్లి పరిస్థితి చూసి విశ్వల కొద్దిగా చలించింది. ఏంటో చెప్పమ్మా'' అడిగింది.

''నీవు ప్రస్తుతానికి చదువు మానేసి నేను చెప్పినట్లు విను. కావాలంటే ఆ తర్వాత మరలా చదుకుందువుగాని. నీ చదువు ఇంకా ఆరు నెలలుంది. ఈ ఆరు నెల్లో మీ నాన్నని ఇక్కడికి రాకుండా చూసే పూచీ నాది. పదిరోజులకొకసారి నేను వచ్చిపోతూ ఉంటాను. నీ కోరిక మేరకే నీవు బ్రతుకు. కన్నతల్లిగా నీకు నేను ఎటువంటి ద్రోహం చేయను. కానీ నేను చెప్పినట్లు చేయి...'' అంటూ జరగవలసిందంతా చెప్పింది. ''ఇలాచేస్తే మనందరం సుఖంగా ఉండొచ్చు. ఎవ్వరూ మనల్ని వేలెత్తిచూపే మాట అనరు. నా మాట కాదనకు చిన్నదాననైనా నీకు దణ్ణంపెడతాను'' అని విలపించింది.

విశ్వల తల్లి చెప్పింది బాగానే అనిపించింది. కన్నతల్లి, ఇక కాదంటే ఏ అఘాయిత్యానికైనా పాల్పడుతుందోనని— ''సరే అమ్మా'' అని ఒప్పుకుంది.

కూతురు చేతిలో ఐదొందల రూపాయలు ఉంచి ''జాగ్రత్తగా ఉండమ్మా. నేను మరలా వారంరోజులలో వస్తాను, మా విశ్వలను కాస్త జాగ్రత్తగా చూడమ్మా'' అంటూ విశ్వల రూంమేటికి చెప్పి అక్కడ నుండి బయలుదేరింది.

సుమారు ఆరు నెలలు గడిచినై.

ఒక రోజున విశ్వలతల్లి భర్తతో ''ఏమండీ నేను మిమ్మల్ని ఒక కోరిక కోరుతాను కాదనరు కదా!''

అంది సంశయిస్తూనే.

"ఏంటోయ్ కోరికంటున్నావు ఏంటి కథ" చిటిక వేస్తూ అడిగాడు విశ్వల తండ్రి.

"మరేం లేదు మనకో అబ్బాయి ఉంటే బాగుంటుందండీ!"

"దిస్ ఈజ్ టూ మచ్.. నా కసలే టైంలేదు"

"మీకు టైం ఉన్నా కనడానికి నాకా ఓపిక లేదండీ"

"మరెలా?"

"ఏ అనాథాశ్రయం నుండన్నా ఒక మగపిల్లాడ్ని తెచ్చుకుని పెంచుకుందామండీ"

"ఇదెక్కడి కోరికే నీ కీ వయస్సులో. ఇంత కాలం లేంది ఇప్పుడేంటంట?"

"అదేనండీ నా బాధ. ఇంతకాలం లేని ఆలోచన ఇప్పుడే కల్గింది అమ్మాయి చదువై పోయింది. రెండు మూడు రోజుల్లో ఇక్కడికి వచ్చేస్తుంది. ఆ తర్వాత దానికి ఎలాగూ పెళ్ళి చేసేయాలి కదా. ఆ తర్వాత నేను ఒంటరి దానినే కదా!"

"అంటే నేను లేనా?"

"ఉన్నాలేనట్టే కదా. మీ రెప్పుడూ బిజినెస్ వ్యవహారాలపై ఊళ్ళు తిరుగుతుంటే ఒంటరిగా కాలక్షేపం చేయలేక నరకయాతన అనుభవిస్తున్నాను. మీకేం తెలుస్తుంది."

విశ్వలకు పెళ్ళిచేసి అత్తవారింటికి పంపేయాలన్న తలంపు వచ్చేసరికి అతనికి కూడా కళ్ళు చెమ్మగిల్లాయి. ఒక్కగానొక్క కూతురు. అల్లారు ముద్దుగా పెంచాడు. ఉన్న ఒక్కర్తి పెళ్ళై వెళ్ళిపోతే ఈ ఇల్లు వెలవెల బోతుంది. రుమాలుతో కళ్ళు అద్దుకుంటున్న భర్తను "ఏంటండీ, ఏ మాట్లాడరేం మనం ఎంత ఏడ్చిగీపెట్టినా ఆడపిల్ల అత్తవారింటికి వెళ్ళిపోవలసిందే కదా. అందుకే మనం ఒక మగపిల్లాడిని పెంచుకుందామండీ. కొంతలోకొంతైనా వాడ్ని చూసి మన అంతిమదశలో సంతోషంగా బ్రతకొచ్చు ఏమంటారు?"

భార్య చెప్పింది తనకు బాగానే అనిపించింది. ఒక్కడ్ని తెచ్చి పెంచడం వల్ల తన ఆస్తి ఏమీ తరిగిపోదు. కావలసినంత ఉంది. ఎంత డబ్బుంటే మట్టుకు మనిషి ప్రేమను డబ్బుతో కొనలేం కదా. భార్య కోరికను కాదనలేకపోయాడు "సరే నీ ఇష్టం" అన్నాడు.

ఆ మర్నాడు విశ్వల సర్వసామాగ్రితో (పుస్తకాలు, బట్టలతో) ఇల్లు చేరుకుంది.

కూతుర్ని ఆలింగనం చేసుకున్నాడు విశ్వల తండ్రి "ఏంటమ్మా ఇలా అయిపోయావు. వంట్లో బాగా లేదా"

"లేదునాన్నా వారం రోజుల నుండి ఒకటే జ్వరం."

"అరెరె అలాగా నాకు వైరిచ్చి ఉంటే నేనొచ్చేవాడ్ని కదమ్మా!"

"ఈ మాత్రం దానికే ఎందుకునాన్న నిన్ను వర్రీ చేయడమని అనని చేయలేదు"

"అది సరేగానీ పరీక్షలు అయిపోయినట్టున్నాయి ఎలా రాశావమ్మా."


"బాగానే రాశాను నాన్న. ఆఖరి రెండు పేపర్లు జ్వరం వల్ల సరిగా రాయలేకపోయాను."

"పోతే పోనీయమ్మ. ఏదో చదవాలనిగానీ, ఉద్యోగాలు చెయ్యాలా ఊళ్ళేలాలా? సర్లే రెస్టు తీసుకో నేనలా బైటికి వెళ్ళి వస్తాను..."

ఆ మర్నాడు.

"నేను పట్టణం వెళ్ళి వస్తానండి"

"నన్నూ రమ్మంటావా!"




"వద్దు లెండి మీరేదో కేంపు కెళ్ళాలన్నారుగా!"

"అదిప్పుడు కాదు సాయంకాలంగా"

"అయినా ప్రయాణం మీద ప్రయాణం. ఈ వయస్సులో మీకు అట్టే మంచిది కాదండి నేనొక్కద్దాన్నే వెళ్ళి వస్తాను"

"సర్లే త్వరగా వచ్చెయ్"

సాయంకాలం భార్య కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు. కేంపు కెళ్ళే టైం ఆసన్నమైంది.

ఉన్నట్టుండి కారు హారన్ మ్రోగేసరికి బైటికి వచ్చాడు. కారులో నుండి దిగుతున్న భార్యను కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూశాడు.

ఆవిడ చేతిలో పదిరోజుల క్రితం పుట్టిన ఒక మగబిడ్డ గుండ్రని ముఖంతో పసిమి వన్నె ఛాయతో అగుపించాడు. "మొత్తం మీద నీ కోరిక నెరవేర్చుకున్నావోయ్... అనాథాశ్రయం నుండే తీసుకొస్తున్నావా?"

"అవునండి"

"ఇంత చిన్నప్పుడే కని వదిలేసిన ఆ మహాతల్లెవరో...!"

వ్యంగంగా అంటుంటే విశ్వలకు నవ్వు చిప్పుక్కుమంది. "వీడికి ఏమని పేరెడదామోయ్.. ఒరేయ్ బాబు నీకు ఏంపేరు పెట్టమంటావురా?" అంటూ తన చేతులలోకి తీసుకున్నాడు ఆ బిడ్డను.

విశ్వలలో ఆత్రుత ఎక్కువైంది. ఎప్పుడా ఎప్పుడా అని ఎదురుచూస్తోంది. ఆమె ఎందు గుండెలు తడైపోతున్నాయి.

"సరే నాకు క్యాంపుకి టైం అయ్యింది. రెండ్రోజులలో తిరిగి వచ్చేస్తాను. ఈలోగా మంచి పేరు వెతికి ఉంచు. ఘనంగా వీడికి పేరుపెడదాం. అమ్మా విశ్వల వెళ్ళొస్తానమ్మా!"

"అలాగే నాన్నా!"

కారులో అల్లంత దూరం వెళ్ళిన తర్వాత తల్లీ కూతుళ్ళు ఇద్దరూ ఇంట్లోకి నడిచారు. తల్లి చేతులలోని బిడ్డను తీసుకుని తన రూంలోకి వెళ్ళి విశ్వల తలుపు గడియపెట్టింది.

ఆమె వక్షస్థలాలు పూర్తిగా తడిసిపోయాయి. ఆత్రుతతో జాకెట్టు బటన్సువిప్పి... వాడు ఆకలితో చిరుపెదాలతో పాలు తాగుతుంటే తన్మయత్వంతో వాడిని గుండెలకు గట్టిగా హత్తుకుని శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది విశ్వల. తలుపుసందులోంచి ఈ దృశ్యాన్ని చూస్తూ భారంగా నిట్టూర్చింది విశ్వల తల్లి.